
సాక్షి
బాపట్ల
మంగళవారం । 12 । మార్చి । 2024



రూ.14.25 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయ చిన్న తిరునాళ్ల సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలంలో రూ.14.25 లక్షల ఆదాయం వచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఏఎస్పీ విఠలేశ్వర్ బాధ్యతల స్వీకారం



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీగా బదిలీ అయినా టి.పి.విఠలేశ్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
బాపట్ల	6.22	5.02
గుంటూరు	6.22	5.02
చిలకలూరిపేట	6.26	5.03

న్యూస్‌రీల్

అమరేశ్వరుని హుండీ ఆదాయం రూ.20.91 లక్షలు



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ కానుకల లెక్కించారు. మహాశివరాత్రి అనంతరం హుండీల కానుకల లెక్కింపు దేవదాయశాఖ ఉత్సవ అధికారి పైదమ్మబాయి సమక్షంలో దేవాలయంలో ఉన్న పది హుండీలను లెక్కించారు. లెక్కింపు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి గోపినాథశర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం మొత్తం రూ.7,98,801 వచ్చినట్లు తెలిపారు. ఏడు రోజులలో వివిధ పూజా టికెట్ల ద్వారా రూ.12,86,381 ఆదాయం వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ నగదు మొత్తాన్ని వివిధ బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాకు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దొండపాడు సేవాసమితి, గుంటూరు సేవా సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్దూ పాఠశాలలు ఒంటి పూట

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు మంగళవారం నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఒంటి పూట తరగతులను నిర్వహించాలని డీఈవో పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాంతర ఉర్దూ మాధ్యమం నిర్వహిస్తున్న పాఠశాలలు ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులను నిర్వహించాలని పేర్కొన్నారు. ఉప విద్యాశాఖాధికారులతో పాటు ఎంఈవోలు, హెచ్ఎంలు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అమరేశ్వర ఆలయంలో వసంతోత్సవం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత స్వామికి చూర్ణోత్సవ అనంతరం వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉత్సవమూర్తులకు స్నపన చేసి నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం స్వామికి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 7గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంత సేవామహోత్సవాలు ప్రారంభమవుతాయి.

యార్డుకు 1,44,196 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,44,196 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలపి ఈ-నామ్ విధానం ద్వారా 1,33,776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.19,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,700 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,00,209 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

పేదలకు గృహయోగం



నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో తోట శ్రీదేవి కుటుంబ సభ్యులు

'ఫొటోలో కనిపిస్తున్నది బాపట్ల పట్టణంలోని చిల్లరగొల్లపాలేనికి చెందిన తోట శ్రీదేవి ఇల్లు. భర్త రోజువారీ కూలీ. ఇద్దరు పిల్లలున్నారు. కుమార్తె పెళ్లికి అప్పు చేసి సొంతింటిని, స్థలాన్ని అమ్ముకుంది. ఆరేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటోంది. వచ్చే సంపాదనలో ఇల్లు గడుపుకొని కొడుకుని చదివించుకోవడం కష్టంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలం మంజూరైంది. ఇంటిని నిర్మించుకున్నారు. 'పేదల కోసం నివేశన స్థలాలు ఇవ్వడమే కాకుండా రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇచ్చారు. ఇల్లుకట్టుకున్నామంటే అది ముఖ్యమంత్రి పుణ్యమే. మేము ఇంటిల్లపాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం' అని శ్రీదేవి ఆనందంతో చెప్పింది.

- జగనన్న కాలనీల్లో నిర్మాణాల జోరు
- లబ్ధిదారులకు రాయితీపై నాణ్యమైన నిర్మాణ సామగ్రి
- లబ్ధిదారులకు ఇప్పటికీ రూ. 294.58 కోట్లు అందజేత
- అనునిత్యం పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం



వెల్లటూరులోని జగనన్న లేఅవుట్‌లో పేదలు నిర్మించుకున్న ఇళ్లు

బాపట్లటౌన్: పేదల సొంతింటి కల నెరవేరనుంది. ఇళ్లు పచ్చని తోరణాలతో మురిసిపోనున్నాయి.. ఇంటింటా వెలుగులు కనిపిస్తున్నాయి. రోజుంతా కష్టించిన పేదలు.. వీధుల వెంట, కాలువ కట్ట బతికిడుస్తున్న అభాగ్యులు.. పని కూడా లేక పస్తులుండే అల్పులు... అందరి కష్టాలను చూసి చలించిపోయిన వైఎస్ జగనన్న.. నేనున్నాను.. నేను చూశాను.. నేను చేస్తానని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత పేదల కళ్లల్లో వెలుగులు నింపారు. సొంతింటి కల సాకారం చేశారు. పేదలు ఆనందంతో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలంటూ ఆశీర్వదిస్తున్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు..

జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో 31,192 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా వీరిలో 12,492 మంది ఇప్పటికే గృహనిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. అధికారులు దగ్గరుండి నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక చొరవ తీసుకొని ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరిస్తున్నారు. దీని కోసం ప్రతి లేఅవుటకు ఓ ఇన్‌చార్జి అధికారి(తహసీల్దార్/ఎంపీడీఓ/హౌసింగ్ ఏఈ), మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. వీరితో పాటుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్, సెక్రటరీలు గృహ నిర్మాణాల వేగవంతానికి కృషి చేస్తున్నారు.

రూ.294.58 కోట్ల రుణాలు..

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునికి రూ.1,80,000 అందజేస్తోంది. వీటిని వివిధ దశల్లో, విడతల వారీగా వారి ఖాతాల్లో జమచేస్తుంది. బేస్‌మెంట్ లెవెల్ రూ.70 వేలు, రూఫ్ లెవెల్ రూ.50 వేలు, శ్లాబ్ దశలో రూ.40 వేలు, నిర్మాణం పూర్తయిన తరువాత రూ.20 వేలు మొత్తం రూ.1,80,000, చెల్లిస్తోంది. డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలు బ్యాంకు రుణం ఇప్పిస్తోంది. పొదుపు సంఘాల్లోని మహిళలకు బ్యాంకుల ద్వారా ఎస్‌హెచ్‌జీ రుణాలు కూడా సకాలంలో అందజేశారు. ఇప్పటికే జిల్లాలోని లబ్ధిదారులకు రూ. 294.58 కోట్ల రుణాలను అందజేశారు.

జిల్లాలో మంజూరు అయిన ఇళ్లు	31,192
ఇప్పటికే పూర్తి	12,492
వివిధ దశల్లో	18,700

నాణ్యమైన సామగ్రి అందజేత

జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు 90 బస్తాల సిమెంట్, 340 కేజీల ఐరన్, ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. వీటితోపాటు రాయితీపై ఐఎస్ మార్కు కలిగిన విండోఫ్రేమ్ విత్ గ్లాస్ షటర్స్ రెండు (రూ. 7,276), పీవీసీ టాయిలెట్ డోర్ ఫ్రేమ్ విత్ షట్టర్స్ (రూ. 2,640), ఫ్లష్ డోర్ ఫ్రేమ్స్ రెండు (రూ.5,964), ఒడిస్సా పాన్ విత్ ఫ్రీ ట్రాప్ (రూ. 975), ఎలక్ట్రికల్ వస్తువులు (రూ.5,730), తెల్లను న్నం (రూ.383) మొత్తం కలిపి రూ.22,918 విలువైన వస్తువులను అందజేస్తున్నారు.

బాపట్ల జిల్లా సమాచారం

నియోజకవర్గం	లబ్ధిదారులు	బేస్‌మెంట్	రూఫ్‌లెవల్	పూర్తిచేసినవి
వేమూరు	11528	8833	272	2286
రేపల్లె	2976	1582	44	1350
బాపట్ల	3882	1723	251	1903
పర్చూరు	3740	1867	199	1672
అద్దంకి	5921	2566	299	2970
చీరాల	3145	585	237	2311
మొత్తం	31192	17126	1302	12492



చల్లారెడ్డిపాలెంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పేదల ఇళ్లు

ఇంటి కల నెరవేరింది



మాది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. మేము పనిచేయగా వచ్చిన సొమ్ముతో ఇల్లు గడుపుకునేందుకే సరిపోయేది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత పెట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మేము ఇంటిని నిర్మించుకున్నా. మాకు బిల్లులు సకాలంలో వచ్చాయి. మేము గతంలో శాశ్వత భవనం లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం మా సమస్యలు తీరాయి. మేము సీఎంకు రుణపడి ఉంటాం.

– తాళ్ళూరి శారాబండి, కల్లిపాలెం, నిజాంపట్నం

లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందజేస్తున్నాం



జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు నిర్మాణాలు జరిగిన వెంటనే సకాలంలో బిల్లులు మంజూరుచేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 12492 గృహాలు పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక చొరవతో జిల్లాలోని అన్ని లేఅవుట్‌లకు ప్రత్యేక అధికారులను నియమించారు. గృహాలు నిర్మించుకునే పేదలకు అన్నిరకాల వసతులు అందుబాటులో ఉంచుతున్నాం. త్వరలోనే అన్ని గృహాలు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ప్రసాద్, హౌసింగ్ పీడీ

స్పందన అర్జీలు సత్వరమే పరిష్కారం



స్పందన అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: స్పందనలో వచ్చే ప్రతి అర్జీని నిర్దేశించిన గడువులోగా అధికారులు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీల ద్వారా వినతి పత్రాలు అందజేశారు. తన పరిధిలోని వాటికి ఆయన అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన వాటిని పరిశీలించి, విచారించాలని జిల్లా అధికారులను ఆన్ లైన్ ద్వారా మండల స్థాయి అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 85 మంది వారి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు సహకారం అందిస్తాం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము



మాట్లాడుతున్న చైర్మన్ రాము

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)లకు పూర్తి సహకారం అందించనున్నట్లు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) తెలిపారు. కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జీడీసీఎంఎస్ మహాజన సభ సమావేశం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. తొలుత జీడీసీఎంఎస్ 2021–22 ఆడిట్ రిపోర్టు, 2023–24 జమ ఖర్చులు, 2024–25 అంచనా బడ్జెట్‌ను బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సభ ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జీడీసీబీ చైర్మన్ రాము మాట్లాడుతూ మూడేళ్లుగా సహకార రంగంలో వస్తున్న నూతన అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. మారుతున్న విధివిధాలకు అనుగుణంగా సహకార సంఘాలు పనితీరు మార్చుకోవాలని కోరారు. నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు, కంప్యూటరీకరణ, పెట్రోలు బంకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, తదితర వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టాలని కోరారు. వ్యవసాయమే దండగా అంటూ రైతులను చంద్రబాబు నట్టేట ముంచితే.. అదే వ్యవసాయాన్ని పండుగ చేసి రైతులకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు దన్నుగా నిలిచారని కొనియాడారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని చెప్పారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు, ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. రాష్ట్రంలోనే గుంటూరు డీసీఎంఎస్ ప్రథమ స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 43 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. పురుగు మందుల అమ్మకాలు, ధాన్యం, మొక్కజొన్న, శనగల కొనుగోళ్లు కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. 2023–24లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ ద్వారా రూ.37.98 కోట్ల వ్యాపారం చేసినట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముందు రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ 2022–23 సంవత్సరం ఆడిట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా డీసీఎంఎస్ పనిచేస్తోందని వెల్లడించారు. సమావేశంలో డీసీఎంఎస్ పాలకవర్గ సభ్యులు ఆరుమళ్ల వెంకట శివ, ఆరికట్ల విజయ భాస్కరరెడ్డి, ప్రసాదం బాల గురవమ్మ, పాల్వాయి ఆదినారాయణ, దాసరి రాజు, కుర్రా పాములు, జీడీసీసీబీ పాలకవర్గ సభ్యులు, డీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, నిజాంపట్నం రైతు సలహా మండలి అధ్యక్షుడు యార్లగడ్డ మదన్ మోహన్ పాల్గొన్నారు.

శివ పార్వతుల తెప్పోత్సవం.. చూసిన కనులదే భాగ్యం

- పెదకాకాని శివాలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు, వేద పండితులు



పెదకాకాని శివాలయం వద్ద మంచి నీటి చెరువులో స్వామి వార్ల తెప్పోత్సవం

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దివ్య తెప్పోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ పూజా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ హాజరయ్యారు. శోభాయమానంగా అలంకరించిన హంస వాహనంలో భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. పుష్ప మాలలు, విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించిన హంస వాహనంలో ఉత్తర భాగాన ఉన్న మంచినీటి చెరువులో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవాన్ని వీక్షించి భక్త జనం పునీతులయ్యారు. తొలుత అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా గణపతి పూజలు చేశారు. తెప్పోత్సవ ప్రదేశం చెరువు కట్టపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాండ్లపై నుంచి అర్చకులు పంచ హారతులు ఇచ్చారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా భ్రమరాంబ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహాహారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నిత్యోపాసన, ఆలయ బలిహరణ, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూల స్నానం, అశ్వవాహనంపై భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గుంటూరు భక్త బృందం కోలాట ప్రదర్శనలు, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి హారతులు అందుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ శ్రీరామవరప్రసాదరావు, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆగయాహే రంజాన్

నెలవంక నవ్వులలో..

- నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం
- ఆహారం నుంచి ఆహార్యం వరకు ప్రతిదీ ప్రత్యేకమే
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆధ్యాత్మిక శోభ



యడ్లపాడు: ఆధ్యాత్మిక జీవనం, ఖురాన్ పఠనం, నమాజ్, జకాత్, ఫిత్రా దానాలు, రోజా(ఉపవాస దీక్షలు).. సాయంత్రం ఇఫ్తార్‌తో ఇట్టే గడిచే పవిత్ర రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం సాయంత్రం నెలవంక దర్శనమైతే.. మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షల్ని ముస్లింలు ప్రారంభించనున్నారు.

అధిక పుణ్య ఫలం

ఆధ్యాత్మిక పరంగా రంజాన్ దీక్షలను పాటించిన వారికి అల్లాహ్ 70 రెట్ల పుణ్య ఫలం ప్రసాదిస్తారని ఇస్లాం గ్రంథాలు బోధిస్తున్నాయి. ఈ నెలలో 'నఫీల్' చదివితే 'ఫరజ్' చదివినంతగా అంటే 70 సార్లు నమాజ్ చేసినంత పుణ్యం ప్రాప్తిస్తుంది. అంతేకాదు ఉపవాస దీక్షలు, దానధర్మాలు (జకాత్, ఫిత్రా)కు ముస్లింలు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం ఫిత్రా(నిర్ణీత దానం) తప్పనిసరిగా చేయాలని నియమం. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని మసీదుల్లో రంజాన్ మాసం సందడి మొదలైంది. రంగులు వేసి, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు లేకుండా చూస్తున్నారు. గ్రామ, పట్టణ కూడళ్లలో రంజాన్ శుభాకాంక్షలు చెబుతూ ముస్లిం యువకులు ఫ్లెక్సీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు.

ఎంతో ప్రత్యేకం..

రంజాన్ నుంచి షవ్వాల్ మాసం వరకు సూర్యోదయం నుంచి తిరిగి చంద్రోదయం చూసే వరకు ఆచరించే రోజా(ఉపవాస దీక్షలు) ఎంతో విశిష్టతను కలిగి ఉన్నాయి. ఈ నెల రోజుల పాటు సహరీ నుంచి ఇఫ్తార్ వరకు అన్నపానీయాలే కాదు లాలాజలాన్ని నోటిలోకి చేరనివ్వరు. ఉపవాస దీక్షలు, ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలతో నిత్యం అల్లాహ్‌ను ఆరాధిస్తారు. నిత్యం ఐదు పూటల నమాజ్‌తో పాటు రాత్రి వేళ తరవీహ్ నమాజ్ పఠించడం రంజాన్ ప్రత్యేకత. పవిత్ర ఖురాన్ గ్రంథంలోని 30 భాగాలను రోజూ ఒకభాగాన్ని రకాతులుగా విభజించి ఈ తరావీహ్ నమాజ్‌లో పఠించడం విశేషం. మామూలు వ్యక్తిని మహోన్నతునిగా మార్చే మాసం కాబట్టే దీనిని వరాల మాసంగానూ వ్యవహరిస్తారు.

రంజాన్ స్పెషల్ హలీం..

ఇఫ్తార్ సమయంలో ముస్లింలు సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలతో దీక్షను విరమిస్తారు. వీటిలో హలీం ఒకటి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున రంజాన్ స్పెషల్ హలీం విక్రయాల కోసం స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో హలీం, హరీస్ సెంటర్లు, వేడివేడి సమోసాలు, పెరుగువడ, ఫలహార విక్రయ దుకాణాలు వెలిశాయి.

'రోజా' దైవాదేశం



మానవాళికి సర్వశుభాలను చేకూర్చే మాసం పవిత్ర రంజాన్. ఈ మాసంలో స్వర్గ ద్వారాలు తెరిచే ఉంటాయి. మనిషి సహనంతో పాటు ఆకలిని తట్టుకునేలా చేసేది రంజాన్ మాసం. ఉపవాసాల ఉద్దేశాన్ని, పవిత్ర ఖురాన్ అవతరణ లక్ష్యాన్ని అర్థం చేసుకుని రంజాన్ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బాలింతలు, రుతుక్రమంలో ఉన్న స్త్రీలు, రోగ గ్రస్తులు మినహా ప్రతి ముస్లిం రోజాను విధిగా పాటించి అల్లాహ్‌కు కృతజ్ఞతలు సమర్పించుకోవాలి.

– ముక్తరుల్లాషా అమిరి, మతగురువు.

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు

కొల్లూరు : స్థానిక అనంతభోగేశ్వర స్వామి ఆలయ తిరునాళ్ల సందర్భంగా గత ఆదివారం రాత్రి ఇరువర్గాల యువకుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కోడికత్తి దాడిలో గాయపడిన యువకుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులను నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన బెకమెక ఏసుబాబు రాత్రి స్థానిక గ్రోమోరు సెంటర్‌లో ఓ యువకుడు తమ కాలనీకి చెందిన వ్యక్తులతో గొడవపడటం గమనించాడు. దీంతో సదరు యువకుడిని హెచ్చరించి, అక్కడి నుంచి పంపించివేశాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువకుడు అంతటితో ఆగకుండా తన సోదరుడు పవన్‌తో పాటు బాబి, సాయి, గోపి అనే మరో కొంతమంది యువకులతో మళ్లీ అక్కడికి వచ్చాడు. కులం పేరుతో దూషించడమే కాకుండా.. పవన్ అనే యువకుడు తనతో తెచ్చుకున్న కోడి కత్తితో దాడి చేయడంతో ఏసుబాబు పొట్ట, నుదిటిపై గాయాలయ్యాయి. ఇది గమనించిన ఎస్సీ ప్రాంతానికి చెందిన మరికొంతమంది యువకులు అక్కడకి చేరుకున్నారు. దీంతో దాడికి పాల్పడిన యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏసుబాబును గుంటూరు జీజీహెచ్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఐదుగురితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే మరో వర్గం యువకుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

శభాష్ నాగ రఘునందన్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో డీఎం కార్డియాలజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి తోట నాగ రఘునందన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 8, 9,10 తేదీల్లో ముంబయిలో జాతీయస్థాయిలో ఇఖో ఇండియా 2024 సదస్సులో కంజనేటల్ హార్ట్ డిసీజ్ (పుట్టకతో వచ్చే హృద్రోగ సమస్య)పై పరిశోధన చేసి రెండవ స్థానంలో నిలిచి బహుమతి సాధించారు. బెంగళూరుకు చెందిన జయదేవ ఇనిస్టిట్యూట్ మాజీ హెచ్.ఓ.డి. ఇఖో ఇండియా ప్రెసిడెంట్- ఎలెక్ట్ డాక్టర్ విజయలక్ష్మి నాగ రఘునందన్‌కు బహుమతితో పాటు పది వేల రూపాయల నగదు అందజేశారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని నిజాంపట్నం, ఆముదాలపల్లి గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేసి, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని కుటుంబం లేదన్నారు. 98 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు తరలివచ్చిన జన సందోహాన్ని చూసి టీడీపీకి ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గోకర్ణమఠం గ్రామంలో రూ.10 లక్షలతో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేసి, నిజాంపట్నంలో పలు సీసీ రోడ్లను ఎంపీ మోపిదేవి



సచివాలయ భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి

ప్రారంభించారు. ఆముదాలపల్లిలో రూ.48లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, సర్పంచ్ నర్రా వెంకమ్మ, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్ బసవపున్నారావు, నిజాంపట్నం సహకార సొసైటీ చైర్మన్ మరకా శ్రీనివాసరావు, మాజీ మండల ఉపాధ్యక్షుడు నర్రా నాగేశ్వరరావు, ఎంపీటీసీ నాజర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో 'సిద్ధం' జోష్

ఎమ్మెల్యే కరణం పిలుపు మేరకు భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు

చీరాల: మేదరమెట్లలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం అవ్వడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ పిలుపు మేరకు ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు సభకు తరలివెళ్లారు. ఇందులో చీరాల నియోజకవర్గం ప్రముఖంగా నిలిచింది. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ పట్టు ఉన్న ఈపూరుపాలెం, గవినివారిపాలెం, పాపాయిపాలెం, దేవాంగపురి, దేశాయిపేట, తీర ప్రాంతాలు కఠారివారిపాలెం, రామాపురం వంటి అనేక గ్రామాల నుంచి ఉవ్వెత్తున జనసందోహం సిద్ధం సభకు చేరుకుంది. టీడీపీ గ్రామాల్లో నుంచి కూడా ఊహించని స్థాయిలో జన సమీకరణకావడంతో చీరాలలో వైఎస్సార్ సీపీ విజయం ఇక నల్లేరుపై నడకేనని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాలు అధికం. వారంతా సొంత పనులు కూడా ఆపుకొని సిద్ధం సభకు తరలివెళ్లడంతో సరికొత్త ఉత్తేజం కనిపించింది. భారీగా తరలివచ్చిన ప్రతి ఒక్కరికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధం సభ ఒక నమ్మకం



అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభ ప్రజలు, పార్టీ శ్రేణుల్లో ఒక నమ్మకం, భరోసానిచ్చింది. క్యాడర్‌లో సీఎం వైఎస్ జగన్ ఉత్సాహాన్ని నింపారు. రాష్ట్రంలో నిర్వహించిన నాలుగు సభలూ విజయవంతమయ్యాయి. ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కడతారు.

– కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే, చీరాల

శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త ఉత్సాహాన్ని సిద్ధం సభలు నింపుతున్నాయి. ప్రజలు, కార్యకర్తలు అంచనాలకు మించి అద్దంకి సభకు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం.

– కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, చీరాల

ఎన్నికల ప్రక్రియలో ఆర్వోలది కీలక పాత్ర

కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు కీలక భూమిక పోషించాల్సి ఉంటుందని, ఆ దిశగా జిల్లాలోని ఆర్వోలు పూర్తి అప్రమత్తతతో బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌తో కలసి ఆయన ఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే విడుదలవుతుందని, వెలువడిన తర్వాత రిటర్నింగ్ అధికారులు నేరుగా ఎన్నికల సంఘానికి అనుసంధానమై ఉంటారన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పని చేయాలని స్పష్టం చేశారు. నామినేషన్ దశ నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అన్ని దశల్లో



ఆర్వోలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి విషయంలో చెక్ లిస్ట్ తయారు చేసుకుని, తదనుగుణంగా బాధ్యతలు నిర్వహిస్తే పొరపాట్లకు ఆస్కారం ఉండదని కలెక్టర్ రంజిత్ బాషా వివరించారు. అలసత్వం వహించకుండా ప్రతిరోజూ సంబంధిత నివేదికలను ఎన్నికల సంఘానికి నివేదించడం తప్పనిసరన్నారు. ఈ సమావేశం లో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి గ్రానైట్ పరిశ్రమ సమస్యలు

చొరవ తీసుకున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బాలాజీ



సజ్జలకు వినతిపత్రం అందజేస్తున్న సమన్వయకర్త బాలాజీ

మార్టూరు: జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ తెలిపారు. మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, పొత్తూరు శివతో కలిసి ఆయన తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ఈ మేరకు వారు సజ్జలకు వినతి పత్రం అందజేశారు. బాలాజీ స్పందిస్తూ.. గ్రానైట్ యజమానుల సమస్యలు పరిష్కారంతో మార్టూరు ప్రాంతంలోని 250 గ్రానైట్ పరిశ్రమలే కాక, వాటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న 50 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ఉత్సాహంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

త్రిపురాంతకం: మహా శివరాత్రి సందర్భంగా త్రిపురాంతకేశ్వర స్వామి తిరునాళ్లలో ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పీఆర్ మెమోరియల్ పులగం త్రిశఘ్నరెడ్డి జస్విత‌రెడ్డి ఎడ్లు మొదటి స్థానంలో నిలిచాయి. వారికి రూ.లక్ష నగదు బహుమతిని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి ప్రదానం చేశారు. రెండో స్థానంలో కృష్ణా జిల్లా ఘంట సాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎంకేఎం బుల్స్ నిలిచాయి. మార్కెట్ యార్డు చైర్మన్ సింగారెడ్డి నాగమణి పోలిరెడ్డి, ఎంపీటీసీ పి.కృష్ణ రూ.80 వేలు ప్రదానం చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి పీవీఎస్ఆర్ బుల్స్ తృతీయ స్థానంలో నిలవడంతో.. ఆలయాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు రూ.60 నగదు బహుమతి ప్రదానం చేశారు. ఇక తదుపరి వరుస స్థానాల్లో దూపాటి సందీప్ శర్మ పీఆర్ మెమోరియల్, మార్టూరుకు చెందిన శ్రీనివాసరావు ఎంకేఎం బుల్స్, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య, గుంటూరు రూరల్ లింగాయపాలెం ఎల్లం సాంబశివరావు, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన వీరయ్య చౌదరి ఎడ్లు నిలిచాయి.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన

నందిగామ: మహా శివరాత్రి పురస్కరించుకొని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం, గ్రామ రైతు కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి



ప్రథమ బహుమతి సాధించిన ఎడ్ల జత

ఎడ్ల పూటీ లాగుడు పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. సీనియర్ విభాగంలో మొత్తం 8 జతల ఎడ్లు పోటీపడ్డాయి. కృష్ణా జిల్లా కోడూరు మండలం విశ్వనాథ పల్లికి చెందిన ఉమా మహేశ్వరరావు ఎడ్ల జత ప్రథమ స్థానం, కంచికచర్ల మండలం మొగులూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజీ ఎడ్ల జత ద్వితీయ స్థానం, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం యమ్మినేనివారి పాలేనికి సుందర్ కుమార్ ఎడ్ల జత తృతీయ స్థానంలో నిలిచాయి. జూనియర్ విభాగంలో గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ఎడ్ల జత మొదటి స్థానం, కృష్ణాజిల్లా కోడూరు మండలం విశ్వనాథ పల్లికి చెందిన ఉమా మహేశ్వరరావు , నాగబాబుల ఎడ్ల జత రెండవ స్థానం, బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన హరికృష్ణ ఎడ్ల జత మూడో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

జపాన్‌లో నర్సింగ్ ఉపాధికి శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవిస్ హెచ్ఆర్ సంస్థ సహకారంతో జపాన్‌లో ఉపాధి అవకాశాల్ని సులభతరం చేసేందుకు నిరుద్యోగ నర్సింగ్ యువతకు జపనీస్ భాష శిక్షణ కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా అధికారి కె.సంజీవరావు సోమవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం విద్యార్హత కలిగి 32 సంవత్సరాల వయస్సులోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జపనీస్ భాషలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు బెంగుళూరులో ఆరు నెలల కాల వ్యవధితో కూడిన రెసిడెన్సియల్ క్లాస్‌రూమ్ శిక్షణ అందిస్తారని వివరించారు. శిక్షణ రుసుం రూ.3.50లక్షలు ఉంటుందని తెలిపారు. దీనిలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50వేలు, శిక్షణ రుసుం రూ.3లక్షలని పేర్కొన్నారు. అభ్యర్థులందరికీ తమ సంస్థ తరపున రూ.25వేలు స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. అభ్యర్థి చెల్లించిన ఫీజును జపనీస్ భాష, సంస్కృతి, మర్యాద, క్లయింట్ ఇంటర్వ్యూ మొదలుకొని ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూ మద్దతు, వీసా స్టాంపింగ్ సహా ఉద్యోగంలో చేరే వరకు వినియోగిస్తారని వివరించారు. రిజిస్ట్రేషన్ http://www.aprrdc.in/home/o nine Pso fram లింక్ ఉపయోగించాలని తెలిపారు. 99888 53335లో సంప్రదించాలని సూచించారు.

43 మంది ఫార్మసిస్టులకు రెగ్యులర్ ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 43 మంది ఫార్మాసిస్టులను రెగ్యులర్ చేస్తూ సోమవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జి.శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-2 ఫార్మాసిస్టులకు గుంటూరులోని ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి రెగ్యులర్ ఉత్తర్వులు జారీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటు డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆచరణలో మహిళా సాధికారత చూపిన జగనన్న

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత ఆచరణలో చూపిందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా జెడ్పీ ఇంజినీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులకు ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో పయనించాలని, పురుషులతో సమానంగా పోటీతత్వంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళాభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలు, చర్యలతో సమాజం



జెడ్పీటీసీలు, మహిళా అధికారులు, ఉద్యోగినులతో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

సైతం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినాను పలువురు జెడ్పీటీసీలు, జెడ్పీ అధికారులు, ఉద్యోగినులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, జెడ్పీ సీఈవో సతీమణి, లక్ష్మీకుమారి, డిప్యూటీ సీఈవో సతీమణి సోనియా, కాకుమాను జెడ్పీటీసీ గుల్జాన్ బేగం, ఉద్యోగినులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని.. బండరాయితో కొట్టిచంపాడు!

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పట్నంబజారు: వ్యక్తి తలపై బండరాయితో మోది హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసుస్టేషన్‌లో స్టేషన్ ఎస్‌హెచ్‌వో పి. దేవప్రభాకర్ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన తోట శ్రీను అలియాస్ సిద్దార్థ్ (32) చిన్ననాటి నుండి జులాయిగా తిరుగుతూ.. తాగుడుకు బానిసగా మారాడు. కొన్నిరోజుల క్రితం గుంటూరుకు వచ్చి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ.. లాడ్జిల్లో, రోడ్లపై నిద్రిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తెలంగాణా రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మీదేవి కాలువ గ్రామానికి చెందిన బొమ్మగాని సతీష్ క్యాటరింగ్ పనులు చేసుకునేందుకు రెండు సంవత్సరాల క్రితం గుంటూరుకు వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. అయితే నిత్యం శ్రీను మద్యం కోసం డబ్బులు లేవని సతీష్ వద్ద లాక్కుంటూ ఉండేవాడు. అనేక రకాలుగా బెదిరిస్తూ.. నిందితుడి వద్ద డబ్బులు తీసుకునేవాడని పోలీసుల తెలిపారు. మృతుడు శ్రీను వేధింపులు తట్టుకోలేని సతీష్ గత నెల 25వ తేదీ రాత్రి మృతుడికి పూటుగా మద్యం తాగించాడు. ఆదివారం సమయం.. దుకాణాలు కూడా మూసివేసి ఉండటంతో ఏలూరు బజా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్, చిత్రంలో వెనుక ముసుగులో ఉన్న వ్యక్తి నిందితుడు

రుకు తీసుకుని వచ్చి అక్కడ శ్రీనుపై సతీష్ దాడి చేశాడు. బండరాయితో మొహంపై గట్టిగా మోదటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితుడి వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 10న ఏటుకూరు రోడ్డులో నిందితుడు ఉన్నాడని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించటంతో హత్యకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఎం సుబ్బారావు, సిబ్బంది కిరణ్, శంకర్, రవి, నజీర్, దేవభిక్షంలను ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్ అభినందించారు.

అతివేగమే ప్రాణం తీసింది!

తాడేపల్లిరూరల్ : స్థానిక కుంచనపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకకు చెందిన బత్తుల రాజీవ్ దుర్గాకుమార్, శివనాగ ప్రమీల కుమారుడు బత్తుల కుషిల్ (19) వడ్డేశ్వరం కేఎల్‌యూలో బీయస్సీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అయితే తన స్నేహితుడు హర్షవర్ధన్ కారులో వస్తుండగా కుంచనపల్లి రోడ్డు వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న ఐరన్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తుల కుషిల్ తీవ్రంగా గాయపడగా హర్షవర్ధన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ ఇరువురిని ఓ ప్రైవేటు



ఆసుపత్రికి తరలిస్తుండగా కుషిల్ మృతి చెందాడు. జరిగిన ఈ సంఘటనపై తండ్రి రాజీవ్ దుర్గాకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అతివేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం సంభవించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.219/2019/ఎ4 తేది.11-03-2024

నరసరావుపేట పురపాలక సంఘమునకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది.01-04-2024 నుండి ది.31-03-2025 వరకు ఈ దిగువ తెలిపిన మార్కెట్‌లలో ఆశీలు వసూలు చేసుకొను హక్కును గజిట్ షరతులకు లోబడి నిర్వహించుకొనుటకు గాను ది.18-03-2024 సోమవారం ఉదయం గం॥ 11.00 పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలము శ్రీయుత కమీషనర్ వారిచే గాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని నిర్వహించబడును. ఏ కారణము చూపకయే వేలంను వాయిదా వేయుటకు కమీషనర్ గారికి పూర్తి అధికారం కలదు.

వ. నెం.	మార్కెట్లు వివరము	కమీషనరు/తహశీల్దారు వార్లచే జారీ చేయబడిన ఆస్తి విలువ/సాల్వెన్సీ ధృవపత్రము	వేలంపాటసమయమున ముందుగా చెల్లించవలసిన డిపాజిట్ ధరావత్తు
1	దినసరి కూరగాయల మార్కెట్ (హోల్‌సేల్ & రిటైల్)	రూ. 8,00,000.00	రూ. 1,50,000.00
2	సంత్రి మార్కెట్	రూ. 8,00,000.00	రూ. 1,50,000.00
3	చేపలు & మాంసం మార్కెట్	రూ. 2,00,000.00	రూ. 25,000.00
4	కబేళా – 1	రూ. 50,000.00	రూ. 25,000.00
5	కబేళా – 2	రూ. 50,000.00	రూ. 25,000.00

పాటలో పాల్గొనదలచిన వారికి సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు సబ్-రిజిస్ట్రార్ వారిచే జారీచేయబడిన ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్ లేనిచో సాల్వెన్సీ బదులుగా చూపబడిన నగదు దాఖలు చేసి వేలంలో పాల్గొనవలెను. సదరు ఆస్తికి సంబంధించి ఏ విధమైన వివాదాలు లేవని వ్యక్తిగత ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలుతో పాటుగా మరియు పాటకు ముందుగా నిర్ణయించిన ధరావత్తును నగదు రూపంలో చెల్లించి మాత్రమే వేలం పాటలో పాల్గొనవలసియుండునని తెలియజేయడమైనది.

గమనిక: ఇతర వివరములు కార్యాలయము పనివేయు వేళల యందు సంబంధిత సెక్షన్ వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనర్, నరసరావుపేట మునిసిపాలిటీ.